సాక్షి
ప్రకాశం
శుక్రవారం | 14 | జూలై | 2023



మినీ ట్యాంక్‌బండ్‌లా కనిగిరి దొరువు

కనిగిరి దొరువు ప్రాంతాన్ని మినీ ట్యాంక్‌బండ్‌లా మార్చనున్నట్లు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. - IIలో..



రైతుల కోసం మరిన్ని సేవలు

వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ల ద్వారా అన్నదాతల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
33.4/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటీరెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మార్కాపురంలో అంబేడ్కర్ భవనం



మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని మంజూరుచేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సీఎం అదనపు కార్యదర్శి నారాయణ భరత్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి గురువారం తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు మార్కాపురం వచ్చినప్పుడు పట్టణానికి అంబేడ్కర్ భవనాన్ని మంజూరు చేయాలని తాను వినతిపత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇదే విషయంపై 2022 జూన్ 5వ తేదీ కూడా ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. స్పందించిన సీఎం.. అంబేడ్కర్ భవన్ మంజూరు చేశారంటూ ఎమ్మెల్యే కేపీ హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ కలిసి ఫైలు తయారుచేసి పంపాలని ఉత్తర్వుల్లో ఆదేశించారని ఎమ్మెల్యే వెల్లడించారు.

దర్శిలో తాగునీటికి రూ.121 కోట్లు మంజూరు

దర్శి: దర్శి నగర పంచాయతీలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు రూ.121 కోట్ల నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దానికి సంబంధించి 2.0 కింద జీవోఎంఎస్ నంబర్ 12ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసినట్లు చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమాచారం నిమిత్తం వెబ్‌సైట్‌లో ఉంచిన ప్రాజెక్ట్ వివరాలను చూసుకుని అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఈ నెల 19వ తేదీలోపు అదే వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీ

చీమకుర్తి: జిల్లాలోని 13 కేజీబీవీలలో ఖాళీలను భర్తీ చేసినట్లు సమగ్ర శిక్ష కార్యాలయం అధికారులు తెలిపారు. వారం రోజుల నుంచి జరుగుతున్న ఇంటర్వ్యూల ద్వారా కేజీబీవీలలో ఖాళీగా ఉన్న 5 ప్రిన్సిపాల్ పోస్టులతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, పీఎస్, బీఎస్, సోషల్ సీఆర్‌టీఎస్‌లకు చెందిన 33 పోస్టులకుగానూ 21, పీజీటీలలో 105 పోస్టులకుగానూ 102 పోస్టులు భర్తీ చేసినట్లు వివరించారు.

కంటి వెలుగును పక్కాగా అమలు చేయాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమం అమలుపై గురువారం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇప్పటివరకు పీఎంఓఏలు సర్వే నిర్వహించి కాటరాక్ట్ ఆపరేషన్‌కు 6,386 మంది అర్హులుగా గుర్తించారని తెలిపారు. వారికి 15రోజుల్లోపు ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి ప్రతి ఒక్కరికీ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిని మెరుగుపరచాలన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా అంధత్వ నివారణ సంఘాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంధత్వాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ డి.నళిని, పీఎంఓఏలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశుగ్రాసం ప్రాముఖ్యత తెలుసుకోవాలి


- రైతులతో జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి



పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి, రైతులు

ఒంగోలు సబర్బన్: రైతులు, పశుపోషకులు పశుగ్రాసం ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. స్థానిక జిల్లా పశుగణాభివృద్ధి సంఘ కార్యాలయంలో జిల్లాలోని పశుపోషకులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశుగ్రాసానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం పశుగ్రాస క్షేత్రాలను రైతులు, అధికారులతో కలిసి సందర్శించారు.

పౌరుషాల గిత్త రంకెలేసేలా...



ఒంగోలు గిత్త

చూడముచ్చటైన రూపం.. అందం..గాంభీర్యం కలగలిసిన ఆహార్యం. అడుగుల్లో ఉట్టిపడే రాజసం..హుందాతనం. పౌరుషానికి చిరునామా.. ఇలా ఎన్నో విశిష్ట లక్షణాలు ఒంగోలు గిత్త సొంతం. ఎంతో మేలు జాతి రకంగా పేరొందిన ఇవి ఇటు సేద్యానికి.. అటు అధిక పాల దిగుబడికి రైతులకు కల్పతరువుగా మారాయి. ఇంతటి అపురూప సంపద అంతరించిపోతున్న దశలో పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చదలవాడ పశుక్షేత్రం అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఆధునిక టెక్నాలజీతో పిండమార్పిడి చేస్తూ సంతతి పెంచేందుకు చేసిన ప్రయోగాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటి వరకూ పశుక్షేత్రాలకే పరిమితమైన ఈ విధానం నేడు రైతుల ముంగిటకు చేరుకుంది.

– ఏపీ నెట్‌వర్క్

- ఒంగోలు జాతి గిత్తలకు పూర్వవైభవం దిశగా అడుగులు
- యాంబ్రియో పద్ధతిలో మేలు జాతి దూడల ఉత్పత్తి
- సత్ఫలితాలిస్తున్న కృత్రిమ గర్భధారణ విధానం
- ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల పశువైద్యులకు ప్రత్యేక శిక్షణ
- రైతుల చెంతకే యాంబ్రియో పద్ధతి
- సంతోషం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు
- పశుక్షేత్రానికి పుష్కలంగా నిధులు కేటాయించిన ప్రభుత్వం

ప్రపంచ దేశాల్లో ఖ్యాతి...

కేవలం మన రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే కాదు.. ఏకంగా ప్రపంచంలోని పలు దేశాలు ఒంగోలు జాతి పశువులను దిగుమతి చేసుకుంటున్నాయి. బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, మెక్సికో, అమెరికా, శ్రీలంక, ఫిజీ, జమైకా, ఇండోనేషియా, మలేషియా దేశాలు వీటిని దిగుమతి చేసుకుంటున్నాయంటే వీటి రాజసమే వేరు. 30 రకాల జాతులు ఉన్నాయి. ఈ జాతుల్లో సింధీ, సహివాల్, కంక్రేజ్, గిర్, ఒంగోలు, మైసూరు, కంగాయం, హిసార్లు ఉన్నాయి. వీటిలో ఒంగోలు జాతి పశువులు అనేక దేశాల్లో పేరెన్నికగన్నవి.

చీమకుర్తి గ్రానైట్‌తో పాటు ఒంగోలు జాతి పశువులు ప్రకాశం జిల్లా సొంతం. తెలుగువారి సంస్కృతి వారసత్వ జీవనాన్ని ప్రతిబింబించే ఒంగోలు గిత్తలకు పూర్వవైభవం రానుంది. ఎంతో అపురూప సంపదగా ఉన్న వీటి ఉనికి కాపాడే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. చదలవాడలో ఏర్పాటు చేసిన పశుక్షేత్రం అధికారులు కృత్రిమ గర్భధారణ ద్వారా వీటి సంతతి పెంచనున్నారు.

విజయవంతమైన యాంబ్రియో పద్ధతి...

మేలు జాతి ఆంబోతుల వీర్యాన్ని మరో మేలు జాతి ఆవు అండంలో ప్రవేశపెట్టి పిండాన్ని అభివృద్ధి చేసిన అనంతరం ఎదకు వచ్చిన స్థానిక ఆవుల గర్భంలో పిండాన్ని ప్రవేశపెడతారు. దీని ద్వారా మేలు జాతి పశువులు అభివృద్ధి చెందుతాయి. మేలు జాతి దూడలు పుట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీని వల్ల రైతులకు పాల ఉత్పత్తిలో, వ్యవసాయంలో లబ్ధి చేకూరుతుంది. ఈ విధానాన్ని అధికారులు చదలవాడ పశుక్షేత్రంలో అమలు చేసి విజయం సాధించారు. గతేడాది జనవరిలో గిర్ జాతి ఆవు నుంచి సేకరించిన పిండాలను ఒంగోలు జాతి ఆవులో ప్రవేశపెట్టారు. ఇలా ఆరు పశువుల్లో ప్రయోగం చేశారు. ప్రస్తుతం ఒక ఆవు గతేడాది అక్టోబర్ నెలలో ఈని గిర్ జాతి కోడె దూడకు జన్మనిచ్చింది. మరో మూడు ఈనడానికి సిద్ధంగా ఉన్నాయి.

పశుక్షేత్రం నుంచి రైతు ముంగిటకు...

పశుక్షేత్రంలో చేసిన ప్రయోగాలు సత్ఫలితాలివ్వడంతో అధికారులు మరో అడుగు ముందుకేశారు. ఒంగోలు జాతి గిత్తల సంతతి మరింతగా పెంచేందుకు యాంబ్రియో విధానాన్ని రైతు ముంగిటకు తీసుకెళ్లారు. రెండు విడతలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పది మంది పశువైద్యులకు శిక్షణ ఇచ్చారు. డిసెంబర్, ఫిబ్రవరి నెలల్లో దశల వారీగా పూర్తి శిక్షణ ఇచ్చారు. మార్టూరు, కొత్తపట్నంలోని ఆరు ఆవులకు ఒంగోలు గిత్తల పిండాలను ప్రవేశపెట్టారు. కొత్తపట్నంలో 70 నుంచి 80 ఆవులు ఉండటంతో అక్కడ ఎక్కువ పరీక్షలు చేయాలని పశుక్షేత్రం అధికారులు నిర్ణయించారు. మేలైన జాతులు ఉత్పత్తి చేయడం ద్వారా రైతుల్లో నమ్మకం ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వైద్యులు కావలి, కడప జిల్లాల్లో ఒకటీరెండు ఆవుల్లో ప్రవేశపెట్టి ఫలితాలు సాధించారు. ఈ విధానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పశుసంవర్థక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఒంగోలు జాతి పశువులను అభివృద్ధి చేయడం ద్వారా అధిక పాల ఉత్పత్తి కూడా సాధించవచ్చని అధికారులు అంటున్నారు.



యాంబ్రియో పద్ధతి ద్వారా గతేడాది అక్టోబర్‌లో జన్మించిన గిర్ జాతి కోడె దూడ

ఏటికేడు పెరుగుతున్న సంపద...

క్షేత్రంలో ఇప్పటి వరకు 326 పశువులు ఉన్నాయి. వీటిలో ఆవులు 72, చూడివి 54, ఒట్టి ఆవులు 24, మిగిలినవి ఏడాది నుంచి మూడేళ్లలోపు లేగ దూడలు ఉన్నాయి. క్షేత్రంలో ఏడాదికి 100 దూడలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో 50కిపైగా దూడలు, 50 కోడెదూడలు. గడిచిన ఏడాది కాలంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులకు 43 కోడెదూడలు పంపిణీ చేశారు.



ఈనేందుకు సిద్ధంగా ఉన్న ఒంగోలు జాతి ఆవు

పశుక్షేత్రం అభివృద్ధికి చర్యలు...

ఒంగోలు జాతి పశువులను పరిరక్షించేందుకు చదలవాడ గ్రామంలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో పశుక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. 2004 సంవత్సరం తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి పశుక్షేత్రంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత పాలకులు దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక క్షేత్రానికి రూ.4 కోట్లు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకుని రైతుల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారు. పశువుల సంఖ్య అధికమవుతుండటంతో రూ.2 కోట్లతో నాలుగు నూతన షెడ్లు ఏర్పాటు చేశారు. పాలనా అవసరాల కోసం రూ.70 లక్షలతో పరిపాలన భవనం, వీటితో పాటు మరో రూ.40 లక్షలతో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలతో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో క్షేత్రం వెలుగులు విరజిమ్ముతోంది. అంతేగాకుండా గోచార్ పథకంలో భాగంగా క్షేత్రంలో భూమి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.52 లక్షలు ఖర్చుచేయనుంది.



చదలవాడ పశుక్షేత్రంలోని షెడ్లు

తీరిన పశుగ్రాస కొరత...

క్షేత్రంలో పశువులకు పశుగ్రాసం కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో పశుగ్రాసం కూడా ఇచ్చే పరిస్థితులు లేవని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ.. ఇప్పుడు ఆ కొరత తీరిందని, సుమారు 150 ఎకరాల్లో పశుగ్రాసం పెంచి పశువులకు కడుపు నిండా సమృద్ధిగా గ్రాసం ఇస్తున్నామని తెలిపారు. ఇందులో 34 ఎకరాల్లో బాజ్ర నేపియర్, సూపర్ నేపియర్, దుబ్బుజొన్న, పారాగడ్డి వంటి రకాలు పెంచుతున్నారు. మరో 70 ఎకరాల్లో మాములు జొన్న గడ్డి, 30 ఎకరాల్లో పిల్లిపెసర, జీలుగ, మిగతా ఎకరాల్లో వివిధ జాతుల పశుగ్రాసం పెంచుతున్నారు. అత్యధిక పోషకాలు ఉండే సైలేజీ గడ్డి ఏడాదికి 430 టన్నులు ఉత్పత్తి చేసి పశువులకు అందిస్తున్నారు.

పశుక్షేత్రం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం



ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయించడంతో మాకు, సిబ్బందికి కష్టాలు తొలగిపోయాయి. పశుక్షేత్రంలో ఇప్పటికే మౌలిక వసతులు కల్పించారు. యాంబ్రియో పద్ధతి ద్వారా ఇప్పటికే గిర్ జాతి కోడె దూడ జన్మించింది. దాంతో పాటు మరో మూడు ఆవులు యాంబ్రియో పద్ధతిలో చూడిలో ఉన్నాయి. ఒంగోలు జాతి పశు సంపద పెంపు కోసం మేలు జాతి దూడలను రైతులకు అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ముందుగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు రైతుల పశువుల్లో ఈ పద్ధతి అవలంబించడానికి కృషి చేస్తున్నాం. జిల్లా ఖ్యాతిని మరింత పెంచి ఒంగోలు జాతి రక్షణకు పాటుపడతాం.

– రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్, చదలవాడ పశుక్షేత్రం

లబ్ధిదారుల జీవనోపాధి మెరుగుపడాలి

- ఉన్నతి, స్త్రీ నిధి రుణాలు తీసుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలి
- సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్



డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సబర్బన్: ఉన్నతి, స్త్రీ నిధి నుంచి రుణాలు పొందిన లబ్ధిదారులు ఆ నగదును వారి జీవనోపాధి మెరుగుపరుచుకోవడానికి ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ టీటీడీసీ ప్రాంగణంలో డీఆర్‌డీఏ అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఉన్నతి (వడ్డీలేని రుణాలు), ఎస్సీ, ఎస్టీ, టీఎస్టీ పథకాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా పథకాల ద్వారా రుణాలు పొందిన వారు వాటిని సక్రమంగా వినియోగిస్తున్నారా..లేదా అనే వివరాలను వీఓఏలు నమోదు చేయాలని ఆదేశించారు. ఏపీఎంలు ఈ విషయాలపై వీఓఏలతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. స్త్రీ నిధి నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించని వారిని గుర్తించి వారిచే రెండు నెలల్లోపు, అలాగే ఉన్నతిలో రుణాలు పొంది చెల్లించని వారితో నెలలోపు రుణాలు చెల్లించే విధంగా ఏపీఎంలు, సీసీలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులు రుణాలు కట్టినా కూడా వాటిని బ్యాంకులకు కట్టకుండా ఉండే వారిని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని చెప్పారు. అలాంటి వారి వద్ద నుంచి 15 రోజుల్లోపు వివరణ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉన్నతిలో ఎన్‌పీఏ 70 శాతంపైన, స్త్రీ నిధిలో ఎన్‌పీఏ రూ.20 లక్షలపైన ఉన్న మండలాల వారికి మెమోలు జారీ చేయాలని కూడా ఆదేశించారు. వాటి పురోగతిపై 15 రోజులకోసారి సమీక్షించాలన్నారు. ఎఫ్‌పీఓలు గతంలో రుణాలు తీసుకుని సొంత పనులకు వాడుకున్నట్లు కాకుండా వ్యక్తిగతంగా చేయలేని వాటిని గ్రూపుగా చేయాలన్నారు. అందులో భాగంగా రైతులకు అవసరమైన విత్తనాలు, పనిముట్లు, టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ విషయాలపై ఏపీఎంలు, సీసీలు వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని ఎఫ్‌పీజీలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ ఒక్కో మండలానికి 50 యూనిట్లు ఇవ్వడం జరిగిందని, 45 రోజుల్లో 50 యూనిట్లకు సంబంధించిన లబ్ధిదారులను కచ్చితంగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. జగనన్న పాలవెల్లువలో భాగంగా చేయూత లబ్ధిదారులను గుర్తించి వారిచే అమూల్ సంస్థకు పాలు పోసే విధంగా వీఓఏలు ప్రోత్సహించాలన్నారు. ఒక్కరితో కూడా పాలుపోయించని వీఓఏలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. జీవనోపాధికి సంబంధించిన గ్రూపులలో మహిళలే కాకుండా పురుషులు కూడా ఉంటారన్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సమీక్ష సమావేశానికి హాజరు కాని ఏపీఎంలు, సీసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించారు. సరైన కారణం లేకుండా గైర్హాజరైనట్లు గుర్తిస్తే వారిని సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక నుంచి 15 రోజులకు ఒకసారి మంగళవారం జరిగే మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ కార్యక్రమాలపై కూడా సమీక్షిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలి

- సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ భవాని

కనిగిరి రూరల్: ఉద్యానవన పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ భవాని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 7 మండలాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉద్యానవన పంటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులందరినీ ప్రోత్సహించాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉద్యానవన పంటలైన బత్తాయి, జామ, దానిమ్మ, మునగ తదితర పంటల సాగుకు ఎకరాకు పూర్తిగా రూ.లక్ష అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఉద్యానవన పంటల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, లబ్ధిని క్షేత్రస్థాయిలో వివరించారు. ప్రతి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఉద్యానవన పంటలు సాగు చేసే విధంగా ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కనిగిరి మండలంలోని తక్కెళ్లపాడు, చీర్లదిన్నె, బల్లిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 40 ఎకరాల్లో జరుగుతున్న మొక్కలు నాటే ప్రాథమిక ప్లాంటేషన్ (గుంతలు తవ్వడం) ప్రక్రియను, రైతులు నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, ప్లాంటేషన్ మేనేజర్ విజయలక్ష్మి, ఏపీఓలు షారూన్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, వాఖ్యవతి, మాచర్ల, ఏడు మండలాల ఎన్ఆర్ఈజీఎస్ ఈసీలు, సీసీలు పాల్గొన్నారు.



ఉద్యానవన పంటల ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ భవాని

పల్లెల్లో వందనం: ఒక చేత్తో చంటిబిడ్డ.. మరో చేత్తో పెన్షన్ డబ్బు

వెలిగండ్ల: వెలిగండ్ల ఎస్సీ కాలనీ వలంటీర్ గంధం ప్రశాంతికి ఏడాది వయసున్న పసిబిడ్డ ఉన్నప్పటికీ ఏమాత్రం పాలుపోకుండా ప్రతిరోజూ తన పరిధిలోని ప్రజలందరికీ అవసరమైన సేవలు అందిస్తోంది. బిడ్డను చంకనెత్తుకునే ఉదయాన్నే ఇంటి నుంచి బయలుదేరుతుంది. తనకు కేటాయించిన 50 ఇళ్లను సందర్శిస్తుంది. ఆయా ఇళ్ల ప్రజలతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకుంటుంది. సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంది. అర్హులైన వారితో పథకాలు, సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయిస్తుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందిస్తుంది. పేదలకు సేవ చేసేందుకు వలంటీర్‌గా అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని ప్రశాంతి చెబుతోంది. వలంటీర్‌గా మంచి పేరు తెచ్చుకున్న ఆమెను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.



ఏడాది బిడ్డను ఎత్తుకుని వికలాంగుడు వెంకటస్వామికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ప్రశాంతి

వలంటీర్ ప్రశాంతి సేవలు అభినందనీయం



మా వలంటీర్ గంధం ప్రశాంతి మెరుగైన సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకుంది. కూలి పనులు చేసుకుని జీవించే నాకు పెన్షన్ ఎంతో ఆధారం. క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే నా ఇంటికి పెన్షన్ తెచ్చి ఇస్తుంది. తనకు చంటిబిడ్డ ఉండగా, చంకనెత్తుకుని మరీ ఇంటింటికీ తిరుగుతూ సేవలందిస్తోంది.

– కారంపూడి వెంకటస్వామి, వికలాంగుడు, వెలిగండ్ల

పనితీరు మార్చుకోని సిబ్బందిపై చర్యలు

- మార్కాపురం జిల్లా వైద్యశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ సేతుమాధవన్

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాలను సబ్ కలెక్టర్ సేతుమాధవన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, వైద్యుల పనితీరు గురించి తెలుసుకుని కొందరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోని సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ రాకతో బయట ఉన్న మెడికల్ సిబ్బంది హడావిడిగా వైద్యశాలకు వచ్చారు. కొన్ని వార్డుల్లో, హాస్పిటల్ బయట అపరిశుభ్రం వాతావరణాన్ని చూసి సిబ్బందిపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యశాలలో పనిచేసే సిబ్బంది చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించాలని, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని చెప్పారు. పలు వార్డులను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

రోగులకు పెట్టే భోజనాలను స్వయంగా పరిశీలించారు. సూపరింటెండెంట్ సుబ్బారెడ్డికి పలు సూచనలు చేశారు. వైద్యశాలలోని ఓ మహిళా రోగి తనకు సెలైన్ బాటిల్ పెట్టి మళ్లీ తీయకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు చేయడంపై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, అలాంటిదేమీ లేదని చెప్పారు. సబ్ కలెక్టర్ వెంట డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.



వార్డులో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ సేతుమాధవన్

కరోనా మృతుడి అంత్యక్రియల్లో వలంటీర్

పొన్నలూరుకు చెందిన సయ్యద్ బాషా కుటుంబ సభ్యులకు కరోనా సోకడంతో వారం రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాలేకపోయారు. హోం క్వారంటైన్‌లో ఉంటున్న వారి దగ్గరకు వెళ్లేందుకు బంధువులు, సన్నిహితులు కూడా ధైర్యం చేయలేకపోయారు. అప్పుడు పరిస్థితి అలాంటిది. కానీ వారి వద్దకు ధైర్యంగా వెళ్లాడు ఆ క్లస్టర్ వలంటీర్ గౌస్ బాషా. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి నాలుగు రోజుల పాటు పాలు, మందులు, వారికి కావాల్సిన వస్తువులను అందించాడు. సయ్యద్ బాషా కరోనాతో మరణిస్తే ఎవరూ దగ్గరకు రాకపోవడంతో వలంటీరే అన్నీ తానై అంత్యక్రియలు పూర్తి చేశాడు.

– పొన్నలూరు

నేను సయ్యద్ బాషా కుటుంబానికి నాలుగు రోజులపాటు సేవలందించా. ఎక్కడ నాకు అపాయం కలుగుతుందోనని మా బంధువులంతా వారించినా.. నా బాధ్యతగా వారికి ధైర్యంగా సేవ చేశా. సయ్యద్ బాషా కరోనాతో చనిపోతే ఎవరూ దగ్గరకు రాలేదు. నేను మానవత్వంతో దగ్గరుండి బాషా అంత్యక్రియలు చేశా. నా క్లస్టర్ పరిధిలోని వల్లెపు సుబ్బమ్మకు కరోనా సమయంలో చీమకుర్తి వెళ్లి ప్రతి నెలా పింఛను నగదు అందజేశా. మాపై పవన్‌కళ్యాణ్ చేస్తున్న ఆరోపణలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం.

– ఎస్‌కే గౌస్‌బాషా, వలంటీర్, పొన్నలూరు



వల్లెపు సుబ్బమ్మకు చీమకుర్తి వెళ్లి పింఛన్ అందజేస్తున్న గౌస్‌బాషా

మినీ ట్యాంక్‌బండ్‌లా కనిగిరి దొరువు

- మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తాం
- చిన్నారుల కోసం సుందరమైన పార్క్ నిర్మిస్తాం
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్
- రూ.56 లక్షలతో దొరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: కనిగిరి దొరువు ప్రాంతాన్ని మినీ ట్యాంక్‌బండ్‌లా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక దొరువు వద్ద ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, కనిగిరి పురపాలక సంఘ నిధులు రూ.56 లక్షలతో అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్ర కలిగిన దొరువు ప్రాంతంలో ప్రాచీన దేవాలయాలు, కోనేరు ఉన్నందున మరింత సుందరంగా తీర్చిదిద్ది కనిగిరికి ల్యాండ్‌మార్క్‌గా చేస్తామని చెప్పారు. దొరువు ప్రాంత అభివృద్ధికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అందులో మున్సిపల్ వాటా కూడా రూ.60 లక్షలు ఉందన్నారు. మొదటి విడతగా రూ.1.30 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మొదటి విడత నిధులతో కోనేరు అభివృద్ధి, రింగ్ బండ్ తదితర పనులు చేస్తున్నామని చెప్పారు. మహనీయులైన మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, జ్యోతిరావు పూలే, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలతో పాటు శ్రీకృష్ణ దేవరాయలు, కాటమరాజు విగ్రహాలను దొరువ వద్ద ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. కనిగిరి నియోజకవర్గాన్ని పరిపాలించిన నాయకులు, ప్రజాప్రతినిధుల విగ్రహాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. చిన్నారుల కోసం గ్రీనరీ పార్క్, ఊయలలు ఏర్పాటు చేస్తామని, వాకింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, సీహెచ్ సాల్మన్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, కౌన్సిలర్లు శ్రీ రాం సతీష్, దేవరాజ్, పులి శ్రీను, రామనబోయిన శ్రీను, ఖాజా, జి.అబ్రహం లింకన్, దాసరి మురళీ, కంటు గురవయ్య, తిరుపతయ్య, మీరావలి, పెన్నా ఏడుకొండలు, పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, మాలీ, నాగూర్‌బీ, భారతి, వీరభద్రారావు, మల్లికార్జునరావు, విజయమార్తండేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు గొంట్లా మల్లికార్జునరావు, పాతకొట్టు రమణారెడ్డి, సుబ్బారెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ యూత్ కమిటీ ఎంపిక పూర్తి

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ కమిటీ ఎంపిక పూర్తయిందని, అధిష్టానం అనుమతితో త్వరలోనే జాబితా ప్రకటిస్తామని ఆ పార్టీ యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కమిటీలో ప్రధాన కార్యదర్శితోపాటు ఇరువురు ఉపాధ్యక్షులు ప్రతి నియోజకవర్గం నుంచి ఐదుగురు జిల్లా బాధ్యులను ఎంపిక చేశామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితోపాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల అనుమతితో ప్రతినిధులను ఎంపిక చేశామని చెప్పారు. పార్టీ అధిష్టానం ఆమోదించిన వెంటనే యూత్ కమిటీని అధికారికంగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షుడి సమక్షంలో ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు.

18న మార్కాపురంలో మినీ జాబ్ మేళా

మార్కాపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, మార్కాపురంలోని స్కిల్ హబ్ సంయుక్తంగా ఈనెల 18వ తేదీన మార్కాపురంలోని ఎస్‌పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసుండి 10వ తరగతి నుంచి బీటెక్ ఆపై చదువులు పూర్తి చేసిన వారు నేరుగా తమ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 70139 50097, 99888 53335ను సంప్రదించాలని కోరారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటరెడ్డి

పుల్లలచెరువు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మద్దల చిన్న వెంకటరెడ్డి(41) ఇంటికి సమీపంలో ఉన్న వామిదొడ్డిలో బోరు వేశారు. నీటి కోసం మోటార్ వేసేందుకు వామిదొడ్డిలోకి వెళ్లి తీగలను మెయిన్ లైన్‌కు తగిలిస్తుండగా అవి జారి మీద మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే వెంకటరెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి ఘన నివాళి



కమలాకర్‌రెడ్డి స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులు

చీమకుర్తి: సినీ హీరో దివంగత బూచేపల్లి కమలాకర్ రెడ్డి పదో వర్ధంతిని చీమకుర్తిలో గురువారం ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి–పాటిమీదపాలెం రోడ్డులోని కమలాకర్‌రెడ్డి పార్కులో ఆయన స్మాకాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కమలాకర్‌రెడ్డి స్మారకం వద్ద తల్లి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సోదరుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాదరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కమలాకర్‌రెడ్డి హీరోగా, నిర్మాతగా సాగించిన ప్రయాణాన్ని, కుటుంబ సభ్యులతో గడిపిన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని బూచేపల్లి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి 2,400 మంది రోగులు హాజరుకాగా వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 973 మందిని శుక్లాల ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. బూచేపల్లి అభిమానులు 7 వేల మంది అన్నదానంలో పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు పరిహారం

- నలుగురి కుటుంబ సభ్యులకు రూ.20 లక్షలు పంపిణీ



చెక్కులు అందచేస్తున్న డీఎం, తహసిల్దార్

పొదిలి: దర్శి వద్ద సంభవించిన బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం గురువారం అందజేశారు. ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం శ్రీమన్నారాయణ, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదంలో మృతి చెందిన హఫీజ్ అబ్దుల్ అజీజ్, ఉమెహానీ, షీమా, జానీబేగం కుటుంబ సభ్యులకు ఆర్టీసీ తరఫున రూ.5 లక్షలు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురి కుటుంబ సభ్యులకు కూడా త్వరలోనే పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌చార్జి డీఎం చెప్పారు. ప్రమాదం వల్ల మృతుల కుటుంబాలకు జరిగిన నష్టం తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగ యూనియన్ నాయకులు, సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ర ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు



సంఘటనా స్థలంలో ట్రాక్టర్, కారు

చీమకుర్తి: సుబాబుల్ కర్రతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో.. కారులో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి చీమకుర్తి బైపాస్‌లో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. సుబాబుల్ కర్ర లోడ్ చేసుకున్న ట్రాక్టర్ పడమర బైపాస్ నుంచి ఒంగోలు వైపు వెళ్తుండగా.. అదే సమయంలో ఓ కారు ఒంగోలు నుంచి చీమకుర్తి బైపాస్ మీదుగా పొదిలి వైపు వస్తోంది. ఈ క్రమంలో బైపాస్ వద్ద ట్రాక్టర్ ట్రక్‌లోని కర్రను కారులో ఉన్న వ్యక్తులు గమనించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. మృతి చెందిన వ్యక్తి పొదిలి మండలం కంభాలపాడుకు చెందిన ఎస్.రాఘవరెడ్డి(35)గా, గాయపడిన వ్యక్తిని పులిచర్ల సుధాకర్‌గా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

రైతులకు అందుబాటులో మరిన్ని సేవలు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- గిద్దలూరులో అగ్రి ల్యాబ్ ప్రారంభం



అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: జగనన్న ప్రభుత్వం రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో రూ.63.03 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అగ్రిల్యాబ్ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక అగ్రిల్యాబ్‌ను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ ల్యాబ్‌లో రైతులు విత్తనాలు, మట్టి నమూనాలు పరీక్షించుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు ఎటువంటివి ఉపయోగించాలనే విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తోందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జగనన్న ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అందుబాటులోకి తీసుకొస్తూ రైతుల పక్షపాత ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు కలిగే సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండదండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని వసతులతో నూతనంగా నిర్మించిన అగ్రిల్యాబ్‌లోని పరికరాలను ఎమ్మెల్యే అన్నా పరిశీలించారు. రైతులకు సిబ్బంది దగ్గర ఉండి సేవలు అందించాలని కోరారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఏడీఏ బాలాజీనాయక్, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, రాజేశ్వరి, మెర్సీ, జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఓబులరావు పాల్గొన్నారు.

ఎయిర్ గన్ షూటింగ్‌లో ప్రణవికి స్వర్ణం



పతకాలు అందుకుంటున్న ప్రణవి

కొత్తపట్నం: రాష్ట్ర స్థాయి ఎయిర్ గన్ షూటింగ్‌లో కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామానికి చెందిన ద్వారం ప్రణవి స్వర్ణ, రజత పతకాలు సాధించి సత్తా చాటింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జూన్ 14 నుంచి 21వ తేదీ నిర్వహించిన ఎయిర్ గన్ షూటింగ్ 10 మీటర్ల విభాగంలో రెండు స్వర్ణాలు, ఒక రజతం, అలాగే 25 మీటర్ల విభాగంలో స్వర్ణం, కాంస్యం సాధించింది. ఈ నెల 9న విజయవాడలోని ఓ హోటల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ షూటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సలాంధ్ తొట్టెంపూడి, సెక్రటరీ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ఆమె బహుమతులు అందుకుంది. గతంలోనూ ప్రణవి స్వర్ణ పతకాలు సాధించినట్లు తండ్రి ద్వారం జాలిరెడ్డి తెలిపారు.

సొసైటీలు కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: గత రెండేళ్లుగా సహకార రంగంలో వస్తున్న నూతన అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రకాశం భవనంలో గురువారం జిల్లా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ (డీసీడీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న విధివిధానాలకు అనుగుణంగా సహకార సంఘాలు పనితీరు మార్చుకోవాలన్నారు. నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, కామన్ సర్వీస్ సెంటర్లు, జన ఔషధీ కేంద్రాలు, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలన్నారు. జిల్లాలో సాల్ట్ కో ఆపరేటివ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్, ఫిషరీస్ కో ఆపరేటివ్ ద్వారా ఎగుమతుల అవకాశాలు పరిశీలించాలన్నారు. అన్ని శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ నివేదికలు అందించాలన్నారు. ప్రైమరీ సెక్టార్‌కు సంబంధించిన లైన్ డిపార్ట్‌మెంట్లు ఉమ్మడి కార్యాచరణతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆసరా, చేయూత లబ్ధిదారులను జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి అనుసంధానించి పాడి రైతులకు గరిష్ట లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. నాలుగో విడత జగనన్న పాలవెల్లువ కార్యక్రమ విస్తరణకు సంబంధించి మౌలిక సదుపాయాలు, హౌస్‌హోల్డ్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పొలిశెట్టి రాజశేఖర్, పశుసంవర్ధక శాఖాధికారి బేబీరాణి, అగ్రికల్చర్ జేడీ శ్రీనివాసరావు, ఫిషరీస్ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, పీడీసీసీ సీఈఓ ప్రకాష్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు అతి వేగం!

- తృటిలో తప్పిన ప్రమాదం



టంగుటూరు: ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతి వేగం ముగ్గురి ప్రాణాలు తీయబోయింది. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం సాయిబాబా ఆలయం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. జమ్ములపాలెం గ్రామానికి చెందిన గూడూరి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబా ఆలయానికి వెళ్తున్నారు. అదే సమయంలో కొండపి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వి.వి.వినాయక ట్రావెల్స్ బస్సు అతి వేగంతో వస్తోంది. బస్సు డోరు లాక్ చేయకపోవడంతో బైక్‌పై వెళ్తున్న రమేష్ తలకు తగిలి తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడిపోయాడు. స్థానికులు బస్సును వెంబడించి నిలిపేశారు. అయితే బస్సు డ్రైవర్ వాగ్వాదానికి దిగడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఖాదర్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు డ్రైవరును హెచ్చరించి, రూ.వెయ్యి జరిమానా విధించారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్ష వాయిదా

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏఎన్‌యూ పరిధిలో శుక్రవారం నిర్వహించాల్సిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షను వాయిదా వేశారు. 16వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ ఎగ్జామినేషన్స్ అడిషనల్ కంట్రోలర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

త్రిపురాంతకం ఆలయాల హుండీ ఆదాయం రూ.22.38 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

త్రిపురాంతకం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపురసుందరీదేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో 4 నెలల 20 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. నగదు రూపంలో రూ.22.38 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయం హుండీ ద్వారా రూ.14,86,433, త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం హుండీ ద్వారా రూ.7,51,824 ఆదాయం సమకూరినట్లు వివరించారు.

క్లుప్తంగా

పురుగు మందుల శ్యాంపిల్స్ సేకరణ



పురుగు మందుల శ్యాంపిల్లు సేకరిస్తున్న వ్యవసాయ శాఖాధికారి రమేష్

మద్దిపాడు: మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ గురువారం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లోని సదరన్ పెస్ట్ కంట్రోల్ యూనిట్‌లో తయారు చేస్తున్న పురుగు మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులను నాణ్యతా ప్రమాణాలను అనుసరించి తయారు చేయాలని, పురుగు మందుల డబ్బాలపై తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, కంపెనీ అడ్రస్‌తో సహా అన్నీ ముద్రించి ఉండాలని స్పష్టం చేశారు. పురుగుమందుల నాణ్యత పరిశీలించడానికి నమూనాలు సేకరించారు. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపుతామని, ల్యాబ్ రిపోర్టు ఫలితాలు సానుకూలంగా వచ్చిన తర్వాతే డిస్ట్రిబ్యూటర్లకు పంపిణీ చేయాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఆయన ఆదేశించారు. అనంతరం పురుగుమందులు తయారు చేస్తున్న యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వీఏఏలు సాయి, ప్రసన్న, రాజు, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

16న మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయిక

చీమకుర్తి: మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయికను ఈ నెల 16వ తేదీ ఒంగోలు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో గత 29 సంవత్సరాలుగా సహకారం అందించిన మాదిగ ఉద్యోగులంతా ఆత్మీయ కలయికలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షునిగా శ్రీకాంత్



తన్నీరు శ్రీకాంత్

చీమకుర్తి: ప్రకాశం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘ అధ్యక్షునిగా సంతనూతలపాడు మండలం రుద్రవరంకు చెందిన తన్నీరు శ్రీకాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శివయ్య నియమించారు. ఆ మేరకు గురువారం శ్రీకాంత్ మీడియాకు తెలిపారు. తనను నియమించినందుకు వడ్డెర సంఘ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

డిగ్రీ కోర్సుల ప్రవేశాల గడువు పెంచాలి



డీన్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలల్లో కోర్సుల ప్రవేశాల గడువు పెంచాలని జిల్లా ప్రైవేట లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని ఆయన ఛాంబర్‌లో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. డీన్‌తో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీతో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల గడువు ముగిసిందన్నారు. అయితే జిల్లాలో ఇంకా సగం కూడా సీట్లు భర్తీ కాలేదని గడువును పెంచాలని కోరారు. జిల్లాలోని అన్ని బీఈడీ కాలేజీలు విశ్వవిద్యాలయానికి అనుబంధం కావటం మంచి పరిణామమన్నారు. తద్వారా యూనివర్శిటీ బలోపేతానికి తోడ్పాటు అందించారన్నారు. డీన్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ విద్యావంతుల వేదిక కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, అసోసియేషన్ నాయకులు ధారా మోహన్ రావు, వి.బ్రహ్మయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



కంటి పరీక్షలకు భారీగా హాజరైన రోగులు

- సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహణ
- 2,400 మంది రోగులు హాజరు
- వారిలో 973 మందికి కంటి ఆపరేషన్లకు సిఫార్సు
- అన్నదానానికి 7 వేల మంది హాజరు

చీమకుర్తి: సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బూచేపల్లి కల్యాణ మండపంలో బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. కమలాకర్‌రెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కంటి వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారందరినీ పెదకాకానికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించి మళ్లీ చీమకుర్తి తీసుకొచ్చి వదిలిపెడతామని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని బ్యాచ్‌ల వారీగా ప్రత్యేకంగా బస్సులలో పెదకాకాని ఆస్పత్రికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ బూచేపల్లి ట్రస్ట్ తరపున నిర్వాహకులు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు బూచేపల్లి కుటుంబం అని ఎమ్మెల్యే టీజేఆర్ కొనియాడారు. బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి సతీమణి నందిని కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చీమకుర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 2,400 మంది కంటి రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 973 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిని దశల వారీగా పెద కాకాని ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించనున్నట్లు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి తెలిపారు.

ఆపరేషన్లు అవసరం లేని వారికి ఉచితంగా అవసరమైన మందులు అందించారు. కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో చీమకుర్తి మండలంలోని అన్ని గ్రామాల నుంచి 7 వేల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వర్లు స్థానిక డాక్టర్లు బీ జవహర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవ చేయడమే లక్ష్యం

వలంటీర్లకు వందనం

ఒంగోలు రూరల్: వలంటీర్ సునీల్ కుమార్ నెల నెలా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఉత్సాహంగా పనిచేస్తాడని మండువవారిపాలెం గ్రామస్తులు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అందజేసే పెన్షన్‌ను క్యాన్సర్ హాస్పిటల్‌కు వెళ్లి తన క్లస్టర్ పరిధిలోని క్యాన్సర్ బాధితుడు మాజేటి హరిగోపాల్ రావుకు అందజేశాడు. దీంతో పక్కనే ఉన్న వారి బంధువులను సునీల్ అంకితభావానికి సేవా గుణారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలు కొమ్ము సుజ్ఞానమ్మకు కూడా అందించాడు.



క్యాన్సర్ హాస్పిటల్ లో మాజేటి హరిగోపాల్‌రావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సునీల్

– వలంటీర్ సునీల్ కుమార్, మండువవారిపాలెం

పింఛన్ ఆగకూడదని..

ఒంగోలు రూరల్: ఉలిచి గ్రామానికి చెందిన అరిబోయిన శేషయ్య తమ బంధువుల వద్దకు వెళ్ళాడు. ఇంకొల్లు మండలం అనమలూరివారి పాలెంలో ఉండగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆయన సమీపంలోని ఇంకొల్లు హాస్పిటల్‌కి తీసుకుని వచ్చి చికిత్స అనంతరం బంధువుల వద్ద ఉంటున్నాడు. ఇదే సమయంలో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న వలంటీర్.. ఉలిచి 7వ క్లస్టర్‌కు చెందిన చప్పిడి త్రివేణి అనమలూరిపాలెం వెళ్లి అరిబోయిన శేషయ్యకు పెన్షన్ అందజేశారు. వరుసగా పెన్షన్ తీసుకోకుండా ఉంటే ఆగిపోవాల్సిన పెన్షనను చప్పిడి త్రివేణి.. మానవతా కోణంతో ఆగిపోకుండా చేసినందుకు ఆమెను అంతా అభినందించారు. పడకలో ఉన్న శేషయ్య పెన్షన తీసుకుంటుండగా ఆయన కళ్లు చెమర్చినట్లు బంధువులు తెలిపారు.



శేషయ్య కు ఇంకొల్లు మండలంలో పెన్షన్ ఇస్తున్న ఉలిచి వలంటీర్

ఎస్సీకాలనీ ముంపునకు కారకులపై చర్యలు తీసుకుంటాం



అక్రమంగా తవ్విన కాలువను పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు

నాగులుప్పలపాడు: మండలంలోని బీ నిడమానూరులో ఎస్సీకాలనీని ఆనుకుని ఉన్న పొలంలో అక్రమంగా కాలువ తవ్వి వర్షం నీటిని ఎస్సీకాలనీలోకి మళ్లించి ముంపునకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలకు వెనకాడబోమని ఆ గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని ఎస్సీకాలనీలోకి భారీగా వరద నీరు చేరింది. ఇళ్లలోకి సైతం నీరు వెళ్లిన క్రమంలో గురువారం సర్పంచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఇళ్లలోకి చేరిన వరద నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపారు. అనంతరం ఎస్సీకాలనీలోకి అధికంగా వరద నీరు చేరడానికి కారణమైన పరిస్థితులను పరిశీలించారు. కాలనీ పక్కనే పొలం ఉన్న కృష్ణారెడ్డి అనే రైతు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రత్యేకంగా కాలువ తవ్వి ఎస్సీకాలనీలోకి వరద నీరు వెళ్లేలా చేయడంతో ఈ నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అక్రమంగా తవ్విన కాలువను పరిశీలించిన సర్పంచ్ శ్రీనివాసరావు, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, వీఆర్‌వో ప్రభాకరరావు మాట్లాడుతూ త్వరలో సర్వే చేపట్టి ఈ అక్రమాలకు పాల్పడిన కృష్ణారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభివృద్ధి పనులకు 'మాగుంట' సహకారం



పనులు జరుగుతున్న దృశ్యం

కొత్తపట్నం: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం పొక్లెయిన్‌తో ప్రారంభించారు. రోడ్లకు ఇరుపక్కల చెట్లు, రోడ్లు చదును చేయటానికి, ఇరిగేషన్ చెరువులను మరమ్మతులు చేయటానికి మాగుంట శ్రీనివాసులరెడ్డి సొంత నగదుతో పనులు ప్రారంభించారు. కొన్ని సంవత్సరాలుగా వారు ఈ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఉప్పు కొఠారు రోడ్డు ఇరుపక్కల చిల్ల చెట్లు తీయటానికి, రోడ్డు లెవలింగ్ చేయటానికి పూనుకున్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మేడా సుబ్బారావు, రంగాయపాలెం పార్టీ అధ్యక్షుడు ద్వారం మురళి, గాలి మునలారెడ్డి, గుడి నాగిరెడ్డి, షేక్ కమరిముల్లా, గంపాల వెంకటేశ్వర్లు, అజీమ్, కాటా బుల్లియ్య, రాజుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి,బొమ్మిడాల వాసురెడ్డి, కుంతూరి రామకృష్ణారెడ్డి, పురిణి సురేష్ పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు



భూమి పూజ చేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చింతపల్లి గోపి

ఒంగోలు సబర్బన్: నగరంలోని 15వ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ఒంగోలు మేయర్ గంగాడ సుజాత గురువారం భూమి పూజ చేశారు. స్థానిక రామ్ నగర్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న మురుగు కాలువ పనులకు, ఫుట్ పాత్ పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ 15వ డివిజన్‌లో ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం రూ. 90 లక్షలతో మురుగు కాలువ, ఫుట్ పాత్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు ఎంఈ కె.మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

చాపల అక్కమ్మకు నివాళి



చాపల అక్కమ్మకు నివాళులర్పిస్తున్న లంకపోతు అంజిరెడ్డి, అభిమానులు

కొత్తపట్నం: చాపల వంశీకృష్ణ తల్లి చాపల అక్కమ్మకు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, పలువురు అధికారులు, అభిమానులు నివాళులర్పించారు. ఈ నెల 3న అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు 85 సంవత్సరాలు. నలుగు కుమారులు చాపల వినుకొండయ్య, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, చాపల వంశీకృష్ణ. వారందరికీ మంచి విద్యాబుద్ధులు చెప్పి ప్రయోజకులను చేసింది. నాలుగో కుమారుడు డాక్టర్ వంశీకృష్ణ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటూ విశేష సేవలందిస్తున్నారు. గురువారం సొంత గ్రామం కె.పల్లెపాలెం గ్రామంలో ఆమెకు పెద్ద కర్మ నిర్వహించారు. నివాళులర్పించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. లంకపోతు అంజిరెడ్డి, వాయల మోహన్‌రావు పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు.

జగనన్న సురక్ష పథకం క్యాంపులపై సమీక్ష

- నేడు జరగనున్న మూడు క్యాంపులు
- పలు సూచనలు చేసిన ఒంగోలు కమిషనర్



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ఈదర సురేష్

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకంలో నిర్వహిస్తున్న క్యాంపులపై ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహించారు. శుక్రవారం జరగనున్న జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించాల్సిన తీరుపై అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లతో సమీక్ష జరిపారు. భాగ్యనగర్ సచివాలయం పరిధిలో 69 శాతం, వెంగముక్కల పాలెం సచివాలయంలో 76 శాతం, హౌసింగ్ బోర్డు సచివాలయం పరిధిలో 71 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు. గురువారం సాయంత్రానికి మిగతా సర్వే కూడా దగ్గరుండి పూర్తి చేయించినట్లు పేర్కొన్నారు.

సర్వేలో రిజిస్టరైన లబ్ధిదారులకు క్యాంపులో సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు, ఎంఈ కె.మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు, పసుపులేటి శ్రీనివాసరావు ఉన్నారు. భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు, వెంగముక్కల పాలెం సచివాలయాలను సందర్శించారు.

భాగ్యనగర్‌లో పనుల పరిశీలన

భాగ్యనగర్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ గురువారం పరిశీలించారు. భాగ్యనగర్ ఒకటో లైన్‌లో రోడ్డు మార్జిన్లలో కార్లు పార్కింగ్ చేయటాన్ని గమనించిన తీరును చూసి కార్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. రెండో లైన్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి మెటీరియల్ మొత్తం రోడ్డుపైనే ఉండటాన్ని గమనించి భవన యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవన్నారు. చుట్టూ ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు.

కార్డియాలజీ సేవలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్‌లు సీతారామయ్య, రమేష్

ఒంగోలు అర్బన్: స్థానిక వెంకటరమణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అను హాస్పిటల్ సంయుక్తంగా కార్డియాలజీ సేవలు ప్రారంభించడం సంతోషకరమని డాక్టర్‌లు కామేపల్లి సీతారామయ్య, రమేష్ అన్నారు. గురువారం మాట్లాడుతూ గత 54 ఏళ్లుగా వెంకటరమణ వివిధ విభాగాల్లో వైద్య సేవలందిస్తోందని, ఇప్పుడు విజయవాడ, వైజాగ్‌ల్లో ఉన్న అను హాస్పిటల్ ద్వారా కార్డియాలజీ వైద్య సేవలు అందించడం శుభపరిణామమన్నారు. డాక్టర్‌లు కామేపల్లి చంద్రశేఖర్, రమాదేవి, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారు..



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అబ్బాయి పాలెం గ్రామస్తులు

దర్శి: ప్రభుత్వ భూమితో పాటు దారిని కూడా ఆక్రమించి ఇదేమని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమంటున్నారని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాస రెడ్డి, అన్నెం మోగిరామిరెడ్డి తదితర గ్రామస్తులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు అబ్బాయిపాలెం గ్రామ సర్వే నంబర్ 258లో 330.00 సెంట్లు భూమిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పశువులు, జీవాలు మేపుకుంటున్నారు. కురిచేడు మండలం బోధనంపాడు గ్రామానికి చెందిన పుల్లలచెర్వు రామాంజనేయులు అనే వ్యక్తి అనాదీనం భూములను ఇతరుల వద్ద కొనుగోలు చేసి జేసీబీతో చదును చేసుకుని సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. అంతేగాక తాము కొండకు వెళ్లే బాటను కూడా ఆక్రమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెరటి మొక్కలు పెంచండి



ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి మొక్కలు పెంచుకుని మంచి లాభాలు పొందవచ్చని రాధా శింగమనేని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి అన్నారు. గురువారం రూరల్‌లోని ఉలిచి, చేజర్ల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పెరటి మొక్కలు పెంపకం, లాభాలు ఆరోగ్యం తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. ఉలిచి ఆర్‌బీకేలో వీఏఏ బాలక్రిష్ణ, సచివాలయ కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నేల పదునైందని, పెరటి మొక్కలు పెంచుకునేందుకు విత్తనాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అధికారులు అందజేశారని వాటిని వినియోగించుకోవాలనిన్నారు. చేజర్లలో రాధా శింగమనేని మాట్లాడుతూ రెండు తరాలక్రితం ప్రతి గృహంలో తోట ఉండేదని ఆ తోటలో పండిన కూరగాయలనే డిసెంబరు వరకు, జనవరి వరకు వినియోగించుకునే వారని ఆ విధంగానే ప్రస్తుతం పెరటి తోటల పెంపకంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని తద్వారా ఆదాయం మెరుగుపరుచుకోవాలని ఈ కూరగాయలు పూర్తి ఆరోగ్యకరమని ఆమె అన్నారు. చేజర్ల కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్‌బీకే వీఏఏ క్రిష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి

ముండ్లమూరు: నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ నిరీక్షణరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ సిబ్బంది, సచివాలయం ఇంజినీర్లతో ఆయన సమావేశమయ్యారు. నిరీక్షణరావు మాట్లాడుతూ గ్రామాల్లో జూలై చివరి నాటికి గృహాలు పూర్తి చేయాలన్నారు. వాటితో పాటు వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు బిల్లులు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలని చెప్పారు. ఏఈ సీహెచ్ హనుమంతరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

• యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

• ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



• సక్సెస్ స్టోరీ


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

యువర్స్

• టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



• డిస్‌ప్లే: 6.78 అంగుళాలు • రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ • బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ • ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ • ర్యామ్: 8జీబి • రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ • ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి • ఆపరేటింగ్ సిస్టమ్: హామని ఓఎస్ • బరువు: 188 గ్రా. • కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

• డిస్‌ప్లే: 1.4 అంగుళాలు • ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ • హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. • వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ • 120 స్పోర్ట్స్ మోడ్స్ • బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినియం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

• గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి. పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగ వంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.





అనుష్క శర్మ
కియారా అద్వానీ
కత్రినా కైఫ్
ప్రియాంకా చోప్రా
ఆలియా భట్

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


మీనాక్షీ చౌదరి
శ్రీలీల

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


• విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


• అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయూర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.


• సయ్యద్ సోహైల్, రూపా కొడవాయూర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

– ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ–''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.